దివ్యాంగుల సంక్షేమానికి కృషి


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మారేడుపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 202 మంది దివ్యాంగులకు దాదాపు రూ.18 లక్షలు విలువైన పరికరాలను అందజేశారు.

ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం..

కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలను జరుపుకుంటున్న సమయంలో ప్రతిపక్షాలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కారు చేసి చూపిస్తుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో ముఖ్యమంత్రి ప్రజలకు అందుబాటులో లేకుండా నియంతలా వ్యవహరించే వారని ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటున్నారన్నారు.

బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీపై చార్జిషీట్ విడుదల చేసిన బీజేపీ, ముందుగా నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రజల అకౌంట్లలో రూ.15 లక్షలు జమ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన వారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కంటోన్మెంట్‌లో గత 5 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా, నామినేటెడ్ మెంబర్‌తో నెట్టుకొస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ డిప్యూటీ జోనల్ కమిషనర్ సమ్మయ్య, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతున్న రసూల్‌పురాలోని స్ఫూర్తి మానసిక బుద్ధిమాంధ్య పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులు నృత్యాలు, పాటలు, స్కిట్స్ తదితర పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో వికలాంగులకు ఆసరా కల్పిస్తూ వారిని సాధారణ జన జీవనంలో భాగస్వాములను చేసేందుకు స్ఫూర్తి మానసిక బుద్ధి మాంద్యుల పాఠశాల నిర్వహిస్తున్నట్లు బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ్ వంశీ తెలిపారు. బోర్డు చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ మాట్లాడుతూ బోర్డు సహకారంతో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విజయ్ కుమార్ నాయర్, పాఠశాల ప్రిన్సిపాల్ బి.లత, ఉపాధ్యాయులు టి రజిత, పి. సంధ్యారాణి, మాధవిలత, ఎస్. వంశీ, ప్రియదర్శిణి, ఫిజియో థెరపిస్టులు శిరీష్. దీపక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి


పారిశుద్ధ్య కార్మికులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: సమాజానికి పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో తెలంగాణ బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ డిప్యూటీ జోనల్ కమిషనర్ సమ్మయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి డాక్టర్లు ఎంత అవసరమో పారిశుద్ధ్య కార్మికులు కూడా అంతే అవసరమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారి ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తూ మందులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అడ్డుపడే మాలలు మనువాదులే


మాట్లాడుతున్న డప్పు మల్లికార్జున్

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడే మాలలు మనువాదులేనని ఎంఎస్పీ హైద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పార్శీగుట్టలోని అశోక్ సేవా సంఘంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల సామాజిక వర్గం అన్యాయాలు, అవమానాలకు గురైనప్పుడు ఎమ్మార్పీఎస్ అండగా నిలిచిందన్నారు. తాము మాలలను సోదరులుగా భావిస్తుండగా దానిని మరిచి, 58 కులాల ఆత్మాభిమానాన్ని, అభివృద్ధిని అడ్డుకునేలా కొందరు మాల నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు ఉందని ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం దారుణమన్నారు. కొందరు మాలలు జాతి లక్ష్యానికి, అంబేడ్కర్ భావజాలానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారి తీరు మార్చుకోకుండా వ్యక్తిగత విమర్శలు, మందకృష్ణ మాదిగపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, నరేష్, రాజకుమార్, డప్పు మహేష్, మణికంఠ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న బెజ్జాల కృష్ణమూర్తి

లాలాపేట: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రవాణా శాఖతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏటా ఆటో డ్రైవర్‌కు రూ.12500 ఇవ్వాలని, రాపిడ్, ఓలా, ఊబెర్‌లను రద్దు చేయాలనే డిమాండ్ల సాధనను ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేసేందుకు అన్ని కార్మిక సంఘాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు వేణు, శ్రీనివాస్, సురేష్, మహేందర్, సలీం, ఫిరోజ్ పాల్గొన్నారు.

ట్రైన్‌లో మరిచిపోయిన నగదు, నగల బ్యాగ్ అందజేత


హ్యాండ్ బ్యాగ్‌ను అందజేస్తున్న పోలీసులు

అడ్డగుట్ట: వందేభారత్ ట్రైన్‌లో ప్రయాణికురాలు మరిచిపోయిన నగదు, నగల బ్యాగును రైల్వే పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... ఆర్టీసీ క్రాస్ రోడ్ ప్రాంతానికి చెందిన సృజన ఈ నెల 2న వైజాగ్ నుంచి సికింద్రాబాద్‌కు వందేభారత్ రైలులో ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో 12 తులాల నగలు, రూ. 50 వేల నగదు, సెల్‌ఫోన్ ఉన్న తన హ్యాండ్ బ్యాగును మరిచిపోయి రైలు దిగి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన సృజన వెంటనే జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, ప్రసాద్ వందే భారత్ ట్రైన్ వాషింగ్ యార్డ్‌కు వెళ్లి అక్కడున్న క్లీనింగ్ సిబ్బందికి విషయం చెప్పాడు. అందులో పని చేస్తున్న మెట్టుగూడకు చెందిన మాధవి అనే యువతి తనకు బ్యాగు దొరికిందని చెప్పి సదరు బ్యాగును పోలీసులకు అప్పగించింది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు ప్రయాణికురాలికి సదరు హ్యాండ్ బ్యాగ్‌ను అందజేశారు. బ్యాగును అందజేసి నిజాయితీ చాటుకున్న క్లీనింగ్ సిబ్బంది మాధవిని ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ అభినందించారు.

బాలల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- మారేడుపల్లి గురుకులంలో ఆకస్మిక తనిఖీలు
- స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి హాస్టల్ పరిశీలన
- డైట్ చార్జీలను 40 శాతం పెంచినట్లు వెల్లడి
- గురుకులాలు, వసతి గృహాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు
- శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచన



కంటోన్మెంట్: నేటి బాలలే రేపటి భవిష్యత్తు అని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుందనే ధ్యేయంతో ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి మహేంద్రాహిల్స్‌లోని ఎస్సీ బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్‌లో చదువుతున్న పిల్లలను మన పిల్లలనే భావనతో చూడాలని, మంచి విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి కిచెన్, స్టోర్ రూమ్, రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.


గురుకులంలో తనిఖీలు చేస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే శ్రీగణేశ్

స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, కందిపప్పు, కూరగాయలు, పసుపు, కారం పొడి పాకెట్ల నాణ్యతను, కూరగాయలు, పండ్లను పరిశీలించారు. వంటపాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వస్తువుల నాణ్యతను చెక్ చేస్తున్నారా?, స్టూడెంట్స్ కమిటీ పరిశీలిస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలని సూచించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు.

◆ రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర ఒకరిద్దరి నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘటనల ఆధారంగా ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆయా ఘటనలపై ప్రభుత్వం విచారణ చేపట్టిందన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి నిధులు, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. టీఎస్ఆర్ఎస్ డబ్ల్యూఎస్ రాష్ట్ర అధికారి ఎం బీరయ్య, గురుకులం ప్రిన్సిపాల్ శీలం సునీత, ఎస్‌డబ్ల్యూఓ మోహన్, వార్డెన్ జానకమ్మ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ


దివ్యాంగులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ తదితరులు

బౌద్ధనగర్: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో దివ్యాంగులకు వివిధ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని, వారి సంక్షేమానికి పెద్దపీట వస్తుందన్నారు. దివ్యాంగులకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. అనంతరం ఆమె కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, జీహెచ్ఎంసీ డీసీ సుభాష్‌రావులతో కలిసి దివ్యాంగులకు వీల్ చైర్లు, ట్రై సైకిల్స్, హ్యాండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు

బౌద్ధనగర్: ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం చిలకలగూడ, వారాసిగూడ లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి వారాసిగూడ ప్రధాన మార్గంలో ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పాదచారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు తొలగిస్తున్నామన్నారురు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వారు వెంటనే వాటిని తొలగించాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

బౌద్ధనగర్: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి అన్నారు. మంగళవారం బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడే శానిటేషన్ సిబ్బంది తమ ఆరోగ్యం విషయంలోనూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీ సుభాష్ రావు, ఎస్‌పీహెచ్ఓ సక్కుబాయి, డాక్టర్ ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.


శానిటేషన్ సిబ్బందికి మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరం


కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు వరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బేగంపేట డివిజన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డల పెళ్లి ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మాజీ కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ 16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజా భజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, మంగళస్నానం, గణపతిపూజ, అలంకరణ, చండీహోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు నరేష్, నిఖిల్ నేతృత్వంలో ఈనెల 4న ఉదయం జమదగ్ని రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్ష, కార్యదర్శులు సీతారామ్, వీజే శేషగిరిరావు తెలిపారు. బాలరాజ్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన ర్యాలీ


బైక్ ర్యాలీలో పాల్గొన్న వెల్లాల రామ్మోహన్ తదితరులు

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్‌తో పాటు నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట డివిజన్ల మీదుగా బన్సీలాల్‌పేట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుదన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటూ వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ర్యాలీలో బీజేపీ సీనియర్ నేతలు లింగంపల్లి నర్సింగరావు, క్రాంతికుమార్, ఆకుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బన్సీలాల్‌పేట్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు మంగళవారం బోలక్‌పూర్ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైబర్ మోసాలు, సెక్యూరిటీ, డిజిటల్ అరెస్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రి సైబర్ మోసాల తీరు, వాటిని ఎలా కాపాడుకోవాలో వివరించారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌ను ఓపెన్ చేయరాదన్నారు. ఎంతో మంది సైబర్ నేరస్తుల చేతిలో పడి రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారన్నారు. విద్యార్థులు సైబర్ మోసాలపై అవగాహన పెంచుకుని తమ తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని సూచించారు. స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి


పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో పవర్‌బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం ఆయన బొల్లారం సాధన మందిర్ వద్ద పవర్ బోర్ వెల్ పనులను ప్రారంభించారు. నీటి సమస్యపై స్థానికులకు ఇచ్చాన హామీ మేరకు పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు పైపులైన్, ట్యాంక్ ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జయప్రకాష్, మార్కెట్ మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పీడీ. అశోక్ కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

5న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

పద్మారావునగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న సీజీఆర్ఎఫ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈ బ్రహ్మానందం, ఏడీఈ మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి లైన్‌లోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కరెంట్ సరఫరా, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా తమ విభాగం సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని డీఈ బ్రహ్మానందం కోరారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడీహెచ్ కాలనీ సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో సనత్‌నగర్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా విజయం సాధించారన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. తలసాని హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు.

మందకృష్ణపై వ్యక్తిగత విమర్శలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఎంఎస్ఎఫ్ నేతలు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిన యోధుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కొందరు మాల మనువాదులు మందకృష్ణను విమర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు కొమ్ము శేఖర్, పల్లెర్ల సుధాకర్, మందరాజు మాదిగ, అనిల్, సామ్రాట్ అజయ్ విజయ్, కొల హరీష్, మహేందర్, రమేష్, ప్రణయ్, శ్రీకాంత్, శాల్మీయ మాదిగ నేతలు పాల్గొన్నారు.

యోగాకు ఆదరణ పెరుగుతుంది


యోగా షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అమీర్‌పేట: యోగాకు ఆదరణ పెరుగుతుందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె డివిజన్‌లోని బీకేగూడ మున్సిపల్ పార్కులో రూ.35 లక్షలతో చేపట్టనున్న యోగా షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కుకు వచ్చే ప్రజలు వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తేవడంతో పాటు అవసరమైన చోట యోగా చేసుకునేందుకు వీలుగా షెడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధులకు ఈ షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు భరత్ ప్రసాద్ దుబే,అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు అనైతికం

ఉస్మానియా యూనివర్సిటీ: మాలలపై ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణమాదిగ చేసిన వ్యాఖ్యలు దారుణమని భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా), తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా దండోరా ఉద్యమం పేరుతో దళిత వ్యతిరేక పార్టీలతో అంటకాగి మాలల పై విషం చిమ్మడం దారుణమన్నారు. గతంలో వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల కోసం ఎస్సీలను విడదీసేందుకు వర్గీకరణ అంశాన్ని తిరగదోడారన్నారు. మాలలు, మాల నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మందాల భాస్కర్, మంచాల లింగస్వామి, నామసైదులు, వీరస్వామి, మాదాసు రాహుల్, పండుగ భానుతేజ, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


ప్రణీత్‌కుమార్ (ఫైల్)

చిలకలగూడ: ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు హనుమాన్ టెంపుల్ ప్రాంతానికి చెందిన ప్రణీత్‌కుమార్ (13) గతనెల 14న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి అనురాధ పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఆర్థిక ఇబ్బందుల తాళలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్పీ కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పూర్‌కు చెందిన కాశీనాథ్ యాదవ్(49) కూలీ పని చేసేవాడు. అతనికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపానికి లోనైన అతను సోమవారం ఇంట్లో నుండి బయటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం డబీర్‌పూర్ – మేడ్చల్ రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు.